వాన ఎఫెక్ట్

డ్రాగా ముగిసిన యూనిటీ కప్ ఫైనల్



సత్యసాయి యూనిటీ కప్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు, మాజీ క్రికెటర్లు



సంగీత కచేరి నిర్వహిస్తున్న యువత

పుట్టపర్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి యూనిటీ కప్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారడంతో డ్రాగా ముగించారు. స్థానిక హిల్ వ్యూ స్టేడియంలో గోవా, చండీఘడ్ జట్ల మధ్య ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్ వర్షం తో ఆలస్యంగా 11.30 గంటలకు మొదలైంది. గోవా జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. 13 ఓవర్లకు 66 పరుగులు చేసిన దశలో వర్షం రావడంతో కాసేపు విరామం ప్రకటించారు. మ్యాచ్‌ను కుదించి 5 ఓవర్లకు 33 పరుగులు చేయాలని చండీగడ్‌కు లక్ష్యం విధించారు. 9 బంతులకు 11 పరుగులు చేసిన సమయంలో మళ్లీ వర్షం ప్రారంభంకావడంతో ఫైనల్ మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. అంతకుముందు సాయికుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి యూనిటీ కప్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ప్రతినిధి చక్రవర్తి, భారత మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్, శ్రీలంక మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ, వెస్టిండీస్ మాజీ క్రికెటర్ కాళీ చరణ్ ఆవిష్కరించారు. సత్యసాయి యూనిటీ కప్ బ్రోచర్‌ను విడుదల చేశారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి సేవాసంస్థల యువత సంగీత కచేరి నిర్వహించారు. గంటపాటు మధురగానంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం ట్రస్టు ప్రతినిధులు.. మాజీ క్రికెటర్లను పట్టు శాలువాలతో సత్కరించారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజన్న, రామకృష్ణ

కొత్తచెరువు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీపీఈటీలు,పీడీల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అంజన్న, ప్రధాన కార్యదర్శిగా కురుబ రామకృష్ణ ఎన్నికయ్యారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ ఎన్నికలకు సంఘం రాష్ట్ర సభ్యుడు జోసెఫ్, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మయ్య, సత్యనారాయణ పరిశీలకులుగా హాజరయ్యారు. జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా రవీంద్రనాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు శివకుమార్, నేతలు వెంకటేశ్, రామకృష్ణ, స్కూల్‌గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ మోరార్జీ యాదవ్, జిల్లాలోని పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

రక్తమోడిన రోడ్లు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



ప్రమాద స్థలంలో పడిపోయిన బైక్ (వివరాలు 7లో...)

ఉపాధ్యాయ నియామకాలకు

అడుగులు

- ఇప్పటికే ఫలితాలు విడుదల
- నేడో.. రేపో మెరిట్ లిస్ట్
- రాజధానికి జిల్లా విద్యాశాఖ అధికారులు
- దరఖాస్తుల పరిశీలనకు 16 కమిటీలు
- కటాఫ్‌పై అభ్యర్థుల్లో టెన్షన్

పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)



అనంతపురం విద్య ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే అభ్యర్థుల వ్యక్తిగత ఫలితాలను విడుదల చేసింది. జిల్లా, పోస్టుల వారీగా మెరిట్ లిస్ట్ విడుదల కావాల్సి ఉంది. టెట్ మార్కుల నమోదులో తప్పులు చేయడం, రిజర్వేషన్లపై కోర్టుకు కొందరు వెళ్లడంతో ఇతర ప్రక్రియ కొంత ఆలస్యమవుతూ వచ్చింది. న్యాయస్థానం ఫలితాలకు ఆమోదం తెలపడంతో నియామకాలకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. దరఖాస్తుల పరిశీలనకు విద్యాశాఖ కమిటీలు ఏర్పాటు చేసింది. అధికారుల లెక్కల మేరకు.. జిల్లాలో డీఎస్సీ ద్వారా 807 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇందులో ఎస్‌ఏ తెలుగు 28, ఎస్‌ఏ ఉర్దూ 09, హిందీ 28, ఇంగ్లీష్ 103, మ్యాథ్స్ 43, ఫిజిక్స్ 66, బయాలజీ 72, సోషియల్ 110, సోషియల్ ఉర్దూ 01, పీడీ పోస్టులు 145, ఎస్జీటీ తెలుగు 147, ఎస్జీటీ ఉర్దూ 48, ఎస్జీటీ కన్నడ 07 పోస్టుల చొప్పున ఉన్నాయి. ఈ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పక్కాగా పరిశీలనకు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ, డిప్యూటీ తహసీల్దార్‌తో కమిటీలు నియమించారు. ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనకు మొత్తం 16 కమిటీలను విద్యాశాఖ నియమించింది.

నేడు ఎంఈఓ, హెచ్‌ఎంల సమావేశం

జిల్లాలో యాజమాన్యాల వారిగా ప్రస్తుతం ఉన్న ఖాళీల వివరాలను సేకరించి వాటిపై స్పష్టత తీసుకుంటున్నారు. ఇప్పటికే డీఈఓ ప్రసాద్ బాబు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ ముందస్తుగా ఏపీ పాఠశాలకు ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి, అందులో ఏపీ కేడర్‌లో ఎంతమంది టీచర్లు పనిచేస్తున్నారు, ఎక్కడెక్కడ ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో సమాచారం సిద్ధం చేసుకున్నారు. వీటిపై ఎంఈఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పూర్తిగా ఖాళీలపై స్పష్టత తీసుకోవడానికి సోమవారం జిల్లా కేంద్రంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు.

రాజధానికి విద్యాశాఖ అధికారులు

ఉపాధ్యాయ నియామకాల (మిగతా 7లో..)

ఇంటి నుంచే

నీళ్లు

ప్రభుత్వ బడుల్లో దాహం కేకలు

- త్రీఫేజ్ కనెక్షన్ లేక పనిచేయని వాటర్ ప్లాంట్లు
- మధ్యాహ్న భోజనానికి విద్యార్థుల అవస్థలు
- అసంపూర్తిగా నాడు-నేడు పనులు
- పట్టించుకోని అధికారులు



కొత్తచెరువులోని బాలికల ఉన్నత పాఠశాలలో వాటర్‌బాటిళ్లు పెట్టుకుని భోజనం చేస్తున్న విద్యార్థినులు

కొత్తచెరువు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పెడుతున్నారే కానీ.. తాగునీళ్ల లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చాలన్న ఉద్దేశంతో నాడు-నేడు పథకం ద్వారా మౌలిక వసతులు కల్పించేందుకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో 611 పాఠశాలల్లో 611 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. జిల్లాలో 601 పాఠశాలల్లో ఈ ప్లాంట్లు పనిచేయడంలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా అనేక ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు దాహంతో అల్లాడుతున్నారు. మధ్యాహ్న భోజనం తినడానికి ఇంటి నుంచి తాగునీటి బాటిళ్ల తెచ్చుకుంటున్నారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ బడుల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి భారీ ఎత్తున ఆర్వో ప్లాంట్లను (నీటి శుద్ధి యంత్రాలను) ఏర్పాటు చేశారు. త్రీఫేజ్ కరెంట్ ఉంటేనే అవి పనిచేస్తాయి. త్రీఫేజ్ కరెంట్ కనెక్షన్‌కు విద్యుత్ శాఖకు రూ.4 లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినా నిరుపయోగంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు తెచ్చిపెట్టినా బిగించలేదు. జిల్లాలో 2,516 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2,19,283 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా బడుల్లో ప్లాంట్లు మరమ్మతులకు గురైనా విద్యాశాఖ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పిల్లలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

కొత్తచెరువులోని బాలుర హైస్కూల్‌లో పనిచేయని వాటర్ ప్లాంట్



అసంపూర్తిగానే నాడు-నేడు పనులు

జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు మొదటి విడత కింద 573 పాఠశాలల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనుల నిర్వహణకు రూ. 171.91 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.162.74 కోట్ల పనులు జరిగినట్లు విద్యాశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఈ నిధుల్లోనే చాలా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. చాలావరకు ప్లాంట్లు పనిచేయడంలేదు. నిధులు ఖర్చు చేశారే కానీ పనులు పూర్తికాలేదు. రెండో విడత నాడు-నేడు కింద 1081 పాఠశాలల్లో 1635 పనుల నిర్వహణకు రూ.316.56 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి రూ.162.53 కోట్ల పనులు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. కోట్లు ఖర్చు చేసినా పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంటి నుంచే బాటిల్ తెచ్చుకుంటున్నాం



మా పాఠశాలలో 350కు పైగా విద్యార్థులు ఉన్నారు. వాటర్ ప్లాంట్ ఉన్నా పనిచేయడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఉదయం బడికి వచ్చేటప్పుడు ఇంటి నుంచి బాటిల్లో తాగునీరు తెచ్చుకుంటున్నాం. ఒక్క బాటిల్ నీళ్లతోనే రోజంతా గడుపుతున్నాం. మధ్యాహ్నం భోజన సమయంలో నీళ్ల చాలక ఇబ్బందులు పడుతున్నాం.

-దివ్యశ్రీ, 9వతరగతి, కొత్తచెరువు

తాగునీటి సమస్య తీర్చాలి



పాఠశాలలో తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కరెంట్ కనెక్షన్ లేకపోవడంతో పనిచేయలేదు. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి రోజు ఇంటి నుంచి వాటర్ బాటిల్ తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

-చంద్రలేఖ, 9వతరగతి, కొత్తచెరువు

కాంట్రాక్టర్‌కు చెప్పాం

జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు కింద 611 పాఠశాలల్లో 611 వాటర్ ప్లాంట్లను కాంట్రాక్టర్ ఏర్పాటు చేశారు. వాటికి త్రీఫేజ్ కరెంటు కనెక్షన్ ఇవ్వకపోవడంతో 601 పాఠశాలల్లో పనిచేయడంలేదు. వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఇప్పటికే కాంట్రాక్టర్‌కు తెలియజేశాం. సమస్యను విద్యాశాఖ ఆర్జేడీ, కలెక్టర్‌కు తెలియజేశాం.

-కిష్టప్ప, డీఈఓ

శాసనం

గుర్తింపు



ఆలయ స్తంభంపై గుర్తించిన సంస్కృత శాసనం

గోరంట్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరెడ్డిపల్లి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సంస్కృత శాసనాన్ని గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి ఆదివారం ప్రకటనలో తెలిపారు. విజయనగర రాజుల కాలంలో నిర్మించిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ముఖమండపంలో ఓ స్తంభంపై 'శ్రీగోపాల క్రిష్ణయ్య నమఃశ్రీ' అనే ఏక వాక్య సంస్కృత శాసనం గుర్తించానన్నారు. ఆలయ గర్భగుడి ముందున్న ముఖ మండపంలో నాలుగు స్తంభాలు ఉన్నాయన్నారు. ఎడమవైపు ఉన్న మొదటి స్తంభంపై నరసింహస్వామి కూర్చున్న భంగిమలో శిల్పం చెక్కారన్నారు. కిందివైపున శ్రీమహావిష్ణువు శంఖు, చక్ర, గదాధారుడై నిలిచి భక్తులకు అభయమిస్తున్నారన్నారు. నరసింహ, విష్ణువు శిల్పాల మధ్య శాసనం ఉందన్నారు. లిపిని బట్టి సంఘమ వంశానికి చెందిన ఒకటో దేవరాయలుగానీ, రెండో దేవరాయలకు చెందిన శాసనంగా మైనాస్వామి తెలిపారు. మేరెడ్డిపల్లి చెరువు నిర్మాణం నీటికాలువల తవ్వకం పనులను 1388వ శకంనాటి బుక్కరాయల శాసనంగా వివరిస్తుంది. అచ్చతెలుగులో ఉన్న ఈ శాసనం పొలం గట్టుపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తోందన్నారు. ఈ శాసన బండను పురావస్తు శాఖ ప్రదర్శన శాలకు తరలించి, భద్రపరచాలని మైనాస్వామి కోరారు.

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా అధికారులందరూ పాల్గొంటారన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలపై అర్జీలు అందించాలన్నారు.

ఫోన్‌లో ఉగ్ర గుట్టు..!

నూర్ మహమ్మద్ మొబైల్‌లో వివరాలు బయటపడే అవకాశం

- ఉగ్రసంస్థ పిలిస్తే శిక్షణకు రెడీ
- అజ్ఞాతంలోకి ప్రియురాలు
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు
- జిల్లాపై పూర్తి నిఘా

పుట్టపర్తి/ధర్మవరం/హిందూపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు నెరిపిన కొత్వాల్ నూర్ మహమ్మద్ అరెస్టుతో జిల్లాలో కలకలం రేగింది. అతడి ఫోన్‌ను ఫోరెన్సిక్‌కు పంపారు. అందులో ఉగ్ర లింకులు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ధర్మవరంలోని లోనికోట ప్రాంతానికి చెందిన నూర్ మహమ్మద్ పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద వాట్సాప్ గ్రూపుల్లో చురుగ్గా ఉంటూ ఉగ్రవాద భావజాలం, దేశవ్యతిరేక ప్రచారం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఉగ్రగ్రూపులతోపాటు పాకిస్థాన్ నిషేధిత వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసి, ప్రచురించి ధర్మవరంతోపాటు జిల్లాలోని పలు మసీదులు, ప్రార్థనా మందిరాల వద్ద యువతకు పంచిపెట్టినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఉగ్రవాద సంస్థలతో ఆర్థిక లావాదేవీలు సైతం సాగించినట్లు తెలుస్తోంది. ఇక్కడి సమాచారాన్ని ఉగ్రవాద సంస్థలకు చేరవేసేవాడని సమాచారం. ఏదైనా ఉగ్ర సంస్థ పిలిస్తే శిక్షణ ఇవ్వడానికి రెడీగా ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. నూర్ మహమ్మద్‌కు ఉగ్రవాద గూపులతో సంబంధం ఎలా ఏర్పడింది, అందుకు ఎవరు సహకరించారు, ఉగ్రవాద గ్రూపుల నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న సమాచారాన్ని ఎవరెవరికి పంపించాడు అన్న కోణాల్లో పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ఈనేపథ్యంలో కడప సెంట్రల్ జైలులో ఉన్న నూర్‌ను కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. ధర్మవరంలో ఎర్రగుంటకు చెందిన రియాజ్ అనే యువకుడు పాకిస్థాన్ జాతీయ జెండాతోపాటు సయ్యద్ బిలాల్ వీడియోలను వాట్సాప్ స్టేటస్ పెట్టుకోవడాన్ని నిఘా వర్గాలు గుర్తించాయి. శనివారం రియాజ్‌ను అదుపులోకి తీసుకుని, విచారించి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. ధర్మవరంతోపాటు హిందూపురం, కదిరి ప్రాంతాల్లో ఇలాంటి వాట్సాప్ స్టేటస్‌లపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఓవైపు నూర్ మమహ్మద్ ఉగ్రలింకులపై దర్యాప్తు చేస్తూనూ.. మరోవైపు జిల్లా వాప్తంగా ఉగ్రకదలికలపై పోలీసు యంత్రాగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లాలో అనుమానం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టారు.

మొబైల్‌లో ఉగ్రలింకుల గుట్టు

నూర్ మహమ్మద్ నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్‌లో ఉగ్రలింకుల గుట్టు వెల్లడికానుందని పోలీసులు భావిస్తున్నారు. ఆరు ఉగ్రవాద సంస్థలు, 30 పాకిస్థాన్ (మిగతా 7లో..)



తాడిపత్రికి చెందిన ప్రియురాలితో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న నూర్ మహమ్మద్

రైతన్నా.. జాగ్రత్త

- సాగు సమయంలో పాములతో అప్రమత్తం
- ప్రభుత్వ ఆస్పత్రులకు పెరుగుతున్న పాముకాటు కేసులు
- పూర్తి ఉచితంగా విరుగుడు ఇంజక్షన్లు
- నాటు వైద్యం జోలికి వెళ్లొద్దు: వైద్యులు

ధర్మవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాకాలం. పంట పొలాల్లో పాముల సంచారం అధికంగా ఉంటుంది. ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. పొలాలకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏటా ఈ సీజన్‌లో విషసర్పాల కాటుకు ఎంతోమంది రైతులు, రైతు కూలీలు గురవుతున్నారు. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం శ్రేయస్కరం. పాము, విషకీటకాలు ఏమైనా కాటు వేస్తే తక్షణమే ఆస్పత్రికి వెళ్లి వైద్యసేవలు పొందాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. పాముకాటుకు గురైన వ్యక్తి ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి. తద్వారా ప్రమాదం నుంచి బయటపడవచ్చు.

పాములన్నీ విషపూరితం కాదు

పాములన్నీ విషపూరితం కాదు. 15శాతం పాములతోనే ప్రమాదం ఉంది. అదే విధంగా 50శాతం పాముకాట్లు ప్రమాదం లేనివే. గాయమైతే చికిత్స చేసుకుంటే నయమవుతాయి. నాగుపాము, రక్తపింజర, కట్లపాము తదితర పాములు విషసర్పాలుగా చెప్పవచ్చు. జెర్రిపోతు వంటి పాములు కాటువేసినా ఏ ప్రమాదం కాదు. కాని చికిత్స అవసరం.

అవి ఏ మాత్రం పనిచేయవు

పాముకాటుకు గురైన వారు ఎట్టి పరిస్థితులలోనూ టెన్షన్ పడకూడదు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రాథమిక చర్యగా కాటువేసిన భాగంలో కట్టుకట్టాలి. వెంటనే చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లాలి. ఏ పాముకాటు వేసిందో బాధితులు చెబితే తగిన చికిత్సను వైద్యులు అందిస్తారు. పాముకాటు వేసిన చోట కొన్ని రకాల ఆకు పసర్లను పిండటం మంచిదికాదు. మరి కొందరు యంత్రాలను నమ్ముతారు. అవి ఏ మాత్రం పనిచేయవు. అలా చేస్తే ప్రాణాలకే ముప్పు. పసరమందులు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ధాన్యపు గాదెలు, గడ్డివాముల పరిసరాలు, తడిగా ఉన్న ప్రాంతాలలో పశువుల పాకల్లో ఎండుకలప, పిడకలు, పొలాల్లో వరిమడి కోసే సమయంలో, సాగునీటి నిర్వహణ కోసం పంట పొలాల్లో పనుల నిమిత్తం వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. రాత్రి సమయాల్లో పంటపొలాలకు వెళ్లే రైతులు చేతికర్ర, టార్చ్‌లైట్ వినియోగించాలి. ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలి. పంట పొలాలకు వెళ్లే దగ్గరలో ఉండే ఇళ్ల వద్ద పాములు సంచరించే అవకాశం ఉంది. వర్షాలకు పొలాల్లో పాములు సంచరిస్తాయి. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

అందుబాటులో వైద్యం

పాముకాటుకు గురైన వారికి అందుబాటులో వైద్యసేవలు ఉన్నాయి. అన్నిప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా ఆస్పత్రుల్లో యాంటి స్నేక్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో ఆస్పత్రులకు వెళ్లటం వల్ల ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చు. కాటుకు గురైన వారు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.

చికిత్స చేయించుకోవాలి



విష సర్పాలు, విష కీటకాలు కాటువేసిన వెంటనే ఆస్పత్రికి వచ్చి వైద్యులను సంప్రదించాలి. పొలాలకు వెళ్లే రైతులు పాదరక్షలు వాడాలి. టార్చ్‌లైట్‌లు వాడాలి. విషసర్పాలు కాటువేస్తే నాటు వైద్యం జోలికి వెళ్లరాదు. పాముకాటు వేసిన చోట బ్లేడుతో కోయడం, నోటితో పీల్చడంవంటివి చేయరాదు. పాముకాటుకు గురైన వారు భయపడకూడదు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యులను సంప్రదించి విరుగుడు ఇంజక్షన్ వేయించుకోవాలి. ఇలా చేయటం ద్వారా సకాలంలో రోగులు కోలుకుంటారు.

-తిప్పేంద్రనాయక్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, ధర్మవరం

దొంగల ముఠా అరెస్టు 7
స్వేచ్ఛగా పాఠాలు చెప్పే పరిస్థితి లేదు: ఎమ్మెల్సీ గోపీమూర్తి 7

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



బండి అక్కులన్న (ఫైల్)

కనగానపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతానికి ఓ రైతు బలయ్యాడు. గ్రామానికి చెందిన బండి అక్కులన్న(56) అనే రైతు వరి పంట వేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాడు. ఈ క్రమంలో పొలానికి నీరు పెట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చిన విద్యుత్ తీగలను వ్యవసాయ బోరుబావి వైర్‌కు తగిలిస్తుండగా విద్యుత్ షాక్ గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. అటుగా వెళుతున్న రైతులు అక్కడికి వచ్చి తీగలను పక్కకి తీసి చూడగా అక్కులన్న అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య నరసమ్మతో పాటు నాగేంద్ర అనే కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ వైరు దొంగల అరెస్టు



స్వాధీనం చేసుకున్న విద్యుత్ వైర్లను చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వైర్లను దొంగలిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నర్సింగరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా ఆర్డీఎస్ఎస్ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను కత్తిరించి దుండగులు అమ్ముకుంటుండగా ఆదివారం వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఆదిల్‌బాషా, పఠాన్ షబ్బీర్, జమీర్, పఠాన్ జిలానీఖాన్, పఠాని భక్తర్ నిర్మాణదశలో ఉన్న పోల్ నుంచి విద్యుత్ వైర్లను అమ్ముకోవడం ప్రారంభించారన్నారు. మండలంలోని రెండుచోట్ల 800 కిలోలు 40 స్తంభాల విద్యుత్‌వైర దొంగలించారన్నారు. రొద్దం మండలంలో రెండుచోట్ల 800 కిలోలు, పెనుకొండ మండలంలో 1500 కిలోల వైర్లు వాటితోపాటు తరలించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ట్రైనీ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటోలో నగల చోరీ

గోరంట్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన శాంతమ్మ ఆటోలో ప్రయాణిస్తుండగా ఆదివారం రాత్రి దాదాపు ఏడు తులాల బంగారం నగల చోరీ అయ్యాయి. బాధితురాలు తెలిపిన మేరకు.. చిక్‌బళ్లాపూర్‌లోని కుమార్తె నిర్వహిస్తున్న వరలక్ష్మీ వ్రతంలో శుక్రవారం పాల్గొనడానికి నగలు తీసుకెళ్లి పూర్తి అయిన తరువాత తిరిగి వస్తుండగా నగలు చోరీ అయ్యాయి. చిక్‌బళ్లాపూర్‌నుంచి బాగేపల్లివద్ద టీబీ క్రాస్ వద్ద దిగి ఆటోలో గోరంట్లకు వస్తుండగా సంఘటన చోటుచేసుకుంది. టీబీ క్రాస్ వద్ద శాంతమ్మ ఆటోలో బయలుదేరిన సమయంలో మరో ముగ్గురు మహిళలు ఎక్కి, గోరంట్లలోని మోర్ మార్కెట్‌వద్ద దిగారు. శాంతమ్మ ఇంటికెళ్లి హ్యాండ్ బ్యాంగులోని నగలు చూసుకోగా, నెక్లెస్, లాంగ్ చైన్, మరో చైన్ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్కా.. నే చనిపోవాలనుకుంటున్నా!

- ఐదు రోజుల కిందట ఫోన్ చేసిన మనోజ్
- ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు సోదరి ఫిర్యాదు



మనోజ్‌కుమార్

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'అక్కా, నేను తిరుపతి బస్టాండు వద్ద ఉన్నా. నా వల్ల మీరు అప్పులపాలయ్యారు. అందుకని నేను చనిపోవాలనుకుంటున్నా' అని ఈనెల 12వ తేదీ ఉదయం 6.30 గంటలకు ఎం.మనోజ్ కుమార్ ఫోను చేశారు. ఆ తర్వాత ఫోను స్విచ్ ఆఫ్ అయింది. అప్పట్నుంచి వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఆదివారం తిరుపతి పోలీసులకు నాగపావని ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎం.మనోజ్‌కుమార్‌ది అనంతపురం జిల్లాలోని మండల కేంద్రమైన పామిడి గ్రామం. ఇంటి వద్దే ఉంటున్నారు. షేర్ మార్కెట్లో డబ్బులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈనెల పదో తేది ఉదయం 9 గంటలకు ఫోనుచేసి రైలులో తిరుపతికి వెళ్లొస్తానని బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరుమల కొండకి వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకుని తిరుపతికి వచ్చారు. 12వ తేదీ ఉదయం 6.30 గంటలకు కళ్యాణదుర్గం మండలంలోని సోదరి నాగపావనికి ఫోనుచేసి చనిపోవాలనుకుంటున్నానని చెప్పి స్విచ్ ఆఫ్ చేయడంతో ఆందోళన చెందారు. 'మేమంతా తిరుపతికి వచ్చి పరిసర ప్రాంతాల్లో వెదికాం. ఎక్కడా మా తమ్ముడి ఆచూకీ తెలియ రాలేదు. మా స్నేహితులు, బంధువులకు చెప్పి వెతకాలని చెప్పాం. ఎంతకీ ఆచూకీ తెలియరాలేదు' అంటూ నాగపావని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు మొబైల్ రిపేరీ, స్వయం ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అధిక నాణ్యతగల సాంకేతికత, సౌకర్యాలతో మొబైల్, సెల్‌ఫోన్‌ల రిపేరీ, సేల్‌లో నాణ్యమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లలో శిక్షణ 45 రోజుల పాటు ఇస్తారన్నారు. ఎలక్ట్రికల్ శిక్షణతో పాటు కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి, ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ వ్యక్తిత్వ వికాసంలలో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 25వతేదీ నుంచి ప్రారంభమయ్యే శిక్షణ అనంతరం ఉచితంగా టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేస్తామని, అన్నారు. 18-40 సంవత్సరాల వయస్సులోపు ఉన్న నిరుద్యోగ యువత ఐదో తరగతి, పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉన్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో మధ్యాహ్నభోజనం ఉచితంగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8885542201 7780752418లను సంప్రదించాలని కోరారు.

'ఆచారాలు-సంప్రదాయాలు' పుస్తకావిష్కరణ

అనంతపురం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రచయిత ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన 'ఆచారాలు - సంప్రదాయాలు' పుస్తకావిష్కరణ సభను ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సాహితీవేత్తలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న ముఖ్యఅతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలు అనేక కోణాల్లో మనుషల జీవితాలను ప్రభావితం చేస్తుంటాయన్నారు. వాటిలో కొన్ని శాస్త్రీయమైనవి, నమ్మదగినవి కాగా మరికొన్ని మూఢనమ్మకాలతో నిండి ఉంటాయని అన్నారు. ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన ఆచారాలు - సంప్రదాయాలు పుస్తకం చదివితే పాఠకులకు ఈ రెండింటి మధ్య తేడా స్పష్టంగా అవగతమవుతుందన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి తస్నీరు నాగేంద్ర, యోగేంద్ర నాయుడు, ప్రముఖులు తూముచర్ల రాజారామ్, విశ్వనాథ్ రెడ్డి, అనిత, అరుణకుమారి, కొత్తపల్లి సురేష్, మధురశ్రీ, ఎస్ఎస్ బాషా, పూజారి ఈరన్న, నర్సిరెడ్డి, వన్నప్ప పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఫోన్‌లో ఉగ్ర గుట్టు..!

(5వ పేజీ తరువాయి)

గ్రూపుల్లో నూర్ మహమ్మద్ చురుగ్గా ఉన్నట్లు పోలీసుల విచారణలో వెలుగుచూచింది. స్వాధీనం చేసుకున్న రెండు సిమ్‌కార్డులతోపాటు మొబైల్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. మొబైల్‌తో ఎవరెవరికి కాల్ చేశారు, ఎక్కడెక్కడి నుంచి కాల్స్ వచ్చా యి, నూర్ యాక్టివ్‌గా ఉన్న ఉగ్ర గ్రూపుల అడ్మిన్లు ఎవరు, ఏమి సందేశాలు పంపారన్న అంశాలు ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలో వెల్లడికానున్నాయి. ధర్మవరంలో నూర్‌తో పాటు ఇంకా ఎవరెవరికి లిం కులు ఉన్నాయో వెల్లడయ్యే అవకాశాలున్నాయి. వారి భవిష్యత్తు కార్యాచరణ ఏమిటన్నది కూడా తేలియవచ్చని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

అక్కడే పరిచయం ఏర్పడిందా?

నూర్ మహమ్మద్ రెండేళ్ల క్రితం అన్నమయ్య, కడప జిల్లాల్లో నిర్వహించిన ఇజితిమా కార్యక్రమాలకు వెళ్లిన సమయంలో అక్కడ ఉగ్రవాదులతో సంబంధం ఉన్నవారు పరిచయమైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అప్పటి నుంచి ఉగ్రవా ద సంబంధాలున్న వారితో పరిచయాలు పెరగడం తో తరచూ ఫోన్, వాట్సాప్ ద్వారా చాటింగ్ చేస్తుండేవాడని తెలిసింది. ఇలా ఉగ్ర సంస్థలతో పూర్తిగా మమేకమయ్యాడని భావిస్తున్నారు. స్థానికంగా మసీదుల వద్ద ముస్లిం యువతను.. ఉగ్రవాదం వైపు ప్రేరేపించేవాడని అనుమానిస్తున్నారు.

ప్రియురాలి కోసం ఆరా..

నూర్ మహమ్మద్ కొంతకాలంగా తాడిపత్రికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం నడుపుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. దర్యాప్తు బృందాలు ఆ కోణంలో కూడా విచారణ చేపట్టాయి. అతడి ప్రియురాలి పూర్వాపరాల గురించి ఆరాతీస్తున్నట్లు తెలిసింది. ఆమెకు నిషేధిత ఉగ్రసంస్థలతో సంబంధాలున్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నాయి. నూర్‌మహమ్మద్ అరెస్టుతో ప్రియురాలు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. నూర్‌మహమ్మద్ తరచూ వాట్సాప్ కాల్ ద్వారా ప్రియురాలితో సంభాషించిన ఆధారాలను కుటుంబసభ్యులు బహిర్గతం చేశారు. దర్యాప్తు బృందాలు.. ఆమెను అదుపులోకి తీసుకుంటే మరిన్ని వివరాలు బయటపడే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

ధర్మవరంలో ఆందోళన

పట్టుచీరలకు పేరొందిన ధర్మవరంలో ఉగ్రకదలికలు బయటపడటంతో పట్టణ ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇలాంటి వారు ఇంకా ఎంతమంది ఉన్నారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చేనేత రంగం వృద్ధిచెందుతున్న తరుణంలో ఈ ఉగ్ర కదలికల ఉదంతం ఆ వ్యాపార రంగంపై ప్రభావం చూపవచ్చనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి ప్రత్యేక బృందాల ద్వారా మరింత లోతుగా దర్యాప్తు చేయించి ధర్మవరంలో ఉగ్రకదలికలు వెలికితీసి కఠినంగా వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా నిఘా

నూర్ మహమ్మద్ అరెస్టుతో రాష్ట్ర నిఘా విభాగం ఉగ్ర మూలాలను జల్లెడ పట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అనుమానిత ప్రదేశాల్లో నిఘా ముమ్మరం చేసింది. జిల్లాలోని అనుమానిత ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా ఇటీవల కాలంలో వచ్చారా అనే దానిపై రహస్యంగా ఆరాతీస్తున్నారు. ఉగ్రవాద లింకులున్న వ్యక్తులు పట్టణాల్లో ఉంటూ వారిపై ఉగ్రవాద వల విసురుతున్నట్లు తెలుస్తుంది. జిల్లా సరిహద్దులో ఉన్న హిందూపురం, కదిరి, ధర్మవరం, మరికొన్ని పట్టణాల్లో స్థానిక పోలీసు అధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బెంగళూరు దగ్గరగా ఉండటంతో ఈ ప్రాంతాల్లోకి వచ్చి కొన్నిరోజులపాటు స్థిరపడి బెంగళూరుపై గురిపెట్టే అవకాశాలు లేకపోలేదు. దీంతో జిల్లా సరిహద్దులో ఉన్న పోలీసు అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్వేచ్ఛగా పాఠాలు చెప్పే పరిస్థితి లేదు

- ఎమ్మెల్సీ గోపీమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఉరవకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలలు తెరచి రెండు నెలలవుతున్నా ఉపాధ్యాయులు క్లాసులకు వెళ్లి స్వేచ్ఛగా పాఠాలు చెప్పే పరిస్థితి లేదని ఎమ్మెల్సీ గోపీమూర్తి ఆరోపించారు. ఉరవకొండ పట్టణంలో ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు మునుపు యూటీఎఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ.. యోగా డే, మెగా పేరెంట్స్ డే పేరుతో ప్రభుత్వం వారం రోజుల ముందు, తరువాత ఫొటోలు అప్‌డేట్ చేయమనడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు అనుగుణంగా జీఓలు సవరించారని తెలిపారు. గత ప్రభుత్వం పాఠశాలలు విలీనం చేయడం వల్ల ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపారని వివరించారు. రాష్ట్రంలో ఆఫీసర్స్ ఎడ్యుకేషన్ నడుస్తోందని అని అన్నారు. విద్యారంగాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ బడిని నిలుపుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వం తమ భావజాలం నింపివేస్తూ చరిత్రను వక్రీకరించి, మార్చి పాఠ్యపుస్తకాలను చేస్తోందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, నాయకులు రామప్పచౌదరి, జయచంద్రారెడ్డి, రమణయ్య, గోవిందురాజులు, సుధాకర్, తిమ్మప్ప, వీరన్న, రాఘవేంద్ర పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.42

అనంతపురంరూరల్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.42తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

ప్రశాంతతకు భంగం కలిగించే కుట్రలను సహించం

- మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరిక



ధర్మవరంలో ప్రశాంతతకు భంగం కలిగించే కుట్రలను సహించమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. ధర్మవరంలో నూర్ మహమ్మద్ అరెస్టుపై మంత్రి ఆదివారం పట్టణంలో మాట్లాడుతూ.. కేంద్ర నిఘాసంస్థల ఆధారాలు, స్థానిక పోలీసుల అప్రమత్తతతో ఈ అరెస్టులు జరిగాయన్నారు. ఉగ్ర లింకుల్లో కుట్రకోణాన్ని కొట్టి పారేయలేమన్నారు. ధర్మవరంలో అలజడులు సృష్టించాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు తీసుకుంటాయన్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు నిఘాసంస్థల నివేదికల ద్వారా త్వరలో వెలుగులోకి వస్తాయనీ, ఊహాగానాలకు నమ్మవద్దని పట్టణ ప్రజలను మంత్రి కోరారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్లుగా అనంత జట్లు



విజేతలుగా నిలిచిన జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీ విజేతగా అనంతపురం జట్లు నిలిచాయి. గత నాలుగు రోజులుగా తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌లో తూర్పుగోదావరిపై అనంతపురం బాలుర జట్టు, కృష్ణా జిల్లాపై అనంతపురం బాలికల జట్టు గెలుపొంది ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకున్నారు. డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి విజేత జట్లను అభినందించారు. రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ సాధించడం శుభపరిణామని తెలిపారు.

ఉపాధ్యాయ నియామకాలకు అడుగులు

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పలు ఆదేశాలు ఇస్తున్నారు. తాజాగా ప్రతి జిల్లా విద్యాశాఖ నుంచి డీఎస్సీ ప్రక్రియ చూసే సంబంధిత అధికారులను రాజధానికి రావాలని శనివారం ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా విద్యాశాఖ నుంచి డీఈఓతోపాటు ఇతర సెక్షన్, ఐటీసెల్ బృందం ఆదివారం బయలుదేరి వెళ్లింది.

- **అభ్యర్థుల్లో కటాఫ్ టెన్షన్**

అర్హత సాధించిన అభ్యర్థులకు కటాఫ్ టెన్షన్ పట్టుకుంది. ఇప్పటికే వ్యక్తిగతంగా అభ్యర్థుల ఫలితాలు విడుదల చేశారు. మెరిట్ ఆధారంగా జాబితా రావాల్సి ఉంది. ఆ జాబితా వస్తేగానీ ఏఏ కేడర్ పోస్టులకు ఎంత వరకు అత్యధిక మార్కులు వచ్చాయి, రోస్టర్ వారిగా ఏ పోస్టుకు ఎంతవరకు కటాఫ్ రావచ్చో తెలుస్తుంది. మరోవైపు ఈసారి ఒక్కో పోస్టుకు ఒకరినే ఎంపిక చేసి దరఖాస్తుల పరిశీలనకు పిలుస్తారని అంటున్నారు. డీఎస్సీలో ఒక అభ్యర్థే మోడల్ స్కూల్ టీజీటీ, పీజీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ పోస్టులకు పరీక్ష రాసి ఉంటారు. ఒక్కోసారి ఒకే అభ్యర్థి రెండు, మూడు పోస్టులకు అర్హత సాధించి ఉంటారు. ఒక్కో పోస్టుకు ఒక అభ్యర్థినే పిలుస్తారంటున్నారు. ఇది కూడా అభ్యర్థుల్లో గందరగోళం సృష్టిస్తోంది.

- **మార్గదర్శకాలపై స్పష్టత వచ్చే అవకాశం**

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు జరుగుతున్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ప్రక్రియ చేపడుతున్నాం. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలనకు కమిటీలు ఏర్పాటు చేశాం. ఖాళీపై క్షేత్రస్థాయిలో స్పష్టత తీసుకుంటున్నాం. కమిషనర్ ఆదేశాల మేరకు రాజధానికి వెళుతున్నాం. నియామకాల ప్రక్రియ మార్గదర్శకాలపై అక్కడ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రక్తమోడిన రోడ్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి



నాగరాజు, మంజునాథ్ (ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. కొత్తచెరువు మండలంలోని మైలేపల్లి వద్ద ధర్మవరం ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సీఐ మారుతీశంకర్ తెలిపిన మేరకు...ధర్మవరం పట్టణానికి చెందిన మంజునాథ్(22) ద్విచక్ర వాహనంలో కొత్తచెరువులో వివాహానికి హాజరై తిరిగి వెళుతున్నాడు. వేములేటికి చెందిన కొడపగానిపల్లి ఉపసర్పంచ్ చెరువుకోళ్ల నాగరాజు(48) పని నిమిత్తం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌లో కొత్తచెరువుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని మైలేపల్లి వద్దకు రాగానే రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగరాజు కాలు పూర్తిగా విరిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన మంజునాథ్‌ను 108లో కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ మంజునాథ్‌ను పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ మారుతీశంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నాగరాజుకు భార్య రామాంజినమ్మ, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మంజునాథ్ కుంకాలు అమ్ముకుంటూ తల్లిదండ్రులు సూరమ్మ, గోవిందుకు తోడుగా ఉండేవాడు. మంజునాథ్‌కు వివాహం కాలేదు.

లారీని ఆటో ఢీకొని మరొకరు..



ఎస్ షాకీర్ (ఫైల్)

నల్లచెరువు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన మేరకు.. పాత రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి, ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్. షాకీర్ (39) తీవ్రంగా గాయపడ్డాడు. 108లో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంతో మృతి చెందాడు. కె.పూలకుంటకు చెందిన ఎస్.షాకీర్ ప్రతిరోజూ కూరగాయలు, ఇతర సరుకులు విక్రయిస్తుంటాడు. ఆదివారం ఉదయం కదిరిలో కూరగాయలు కొనుగోలుచేయడానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. మృతుడి భార్య మస్తాన్‌బీ కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటోంది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు..



కార్తీక్ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామం వద్ద వేగంగా వెళ్లిన ఓ ద్విచక్ర వాహనం బాలుడిని బలితీసుకుంది. ద్విచక్రవాహనం వేగంగా వెళుతూ రోడ్డు పక్కన ఆడుకుంటున్న బాలుడిని ఢీ కొనడంతో దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ వీరాంజి, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు కార్తీక్(5) రెండు నెలల క్రితం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరాడు. గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ పొలం వద్ద తల్లిదండ్రులు పనులు చేసుకుంటున్నారు. కార్తీక్ రోడ్డు పక్కన ఆడుకుంటుండగా గ్రామానికి చెందిన యువకుడు శేఖర్ రంగచేడు గ్రామం నుంచి బేలోడుకు ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతూ బాలుడిని ఢీ కొని పది మీటర్ల వరకు ఈడ్చుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన బాలుడి కుటుంబసభ్యులు, తల్లిదండ్రులు కేకలు వేయగా వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. పసిబాలుడు వాహనం కిందపడి చనిపోతే కనీసం ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడంటూ కుటుంబ సభ్యులు, బంధువులు మూకుమ్మడిగా శేఖర్ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలియగానే రాయదుర్గం సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో గ్రామానికి చేరుకొని బాలుడి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటరమణ తెలిపారు.

గ్రామంలో బందోబస్తు

బేలోడు గ్రామంలో ఆదివారం బాలుడి ప్రమాద సంఘటన నేపథ్యంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్య, పోలీసు సిబ్బందితో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం గ్రామంలో మొహరం సందర్భంగా దళితులు, వాల్మీకులకు మధ్య గొడవ నేపథ్యంలో అప్పట్లో ఎస్సీలు, వాల్మీకులు 25 మందిపై కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పి వేధించారు. ప్రస్తుతం బాలుడి ప్రమాద సంఘటన ఎస్సీలకు చెందిన యువకుడు బాధితుడు కావడంతో వాల్మీకులు ఆగ్రహంతో దళితులపై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తారని ముందు జాగ్రత్తగా పోలీసులు గ్రామంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



బేలోడులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

న్యూస్ బాక్స్

పంచాయతీరాజ్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక


ఎన్నికైన తాలూకా కమిటీ సభ్యులు

బత్తలపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఉద్యోగుల యూనియన్ ధర్మవరం తాలూకా కమిటీని ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ జిల్లా నాయకులు విజయ శేఖర్ నాయుడు, శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఆ యూనియన్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. తాలూకా అధ్యక్షుడిగా తాడిమర్రి ఎంపీడీఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంటు అక్కిం ప్రతాప్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా కరుణకుమారి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా సుదర్శన్‌రెడ్డి, ఈసీ మెంబర్లుగా గోపాలక్రిష్ణ, అబ్దుల్ నబీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన కమిటీని యూనియన్ నాయకులు గంధం శ్రీనివాసులు, మల్లికార్జున, హరిబాబు, విజయభాస్కర్‌రెడ్డి, అల్లాబకాష్ అభినందించారు.

వీఆర్‌ఏల మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన వీఆర్‌ఏల మండల కమిటీ

బత్తలపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సంఘం మండల కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. మండలంలోని వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా నరసింహులు, ఉపాధ్యక్షుడిగా రాజ, ప్రధాన కార్యదర్శిగా రాంప్రసాద్, కోశాధికారిగా నారాయణస్వామిని ఎన్నుకున్నారు. ఈసీ మెంబర్లుగా శివశంకర్, రామాంజనేయులు, గంగనారమ్మ, బాబు, రామాంజినేయులు, నాగార్జున, నారాయణ, లక్ష్మీనరసమ్మను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఎంపికైన వారిని సన్మానించారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

తనకల్లు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షాబుద్దీన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖలాధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన సూచించారు. ప్రజలు సమస్యలను ఫిర్యాదుల రూపంలో అందించాలని తహసీల్దార్ సూచించారు.

సూపర్‌సిక్స్‌తో రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

తనకల్లు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ దిశగా నడిపిస్తోందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దుల క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా స్త్రీశక్తి పేరుతో ఉచిత బస్సుపథకం ప్రారంభించి అమలు చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. కృష్ణా జలాలను పుంగనూరు, అక్కడనుంచి కుప్పానికి తరలించడంతో పాటు, కదిరి నియోజకవర్గంలోని అన్నిమండలాల్లోని చెరువులకు నీరందించేందుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రసిద్ధ కదిరి నరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కృషి అభినందనీయమన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలని వినతి


రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రికి విన్నవిస్తున్న నాయకులు

కదిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యలను పరిష్కరించాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం పలువురు నాయకులు రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రిని కోరారు. ఆదివారం కదిరికి వచ్చిన ఆమెను స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఘనంగా సన్మానించారు. రజకుల ను ఎస్సీ జాబితాలు చేర్చాలని, ఉచిత విద్యుత్ ల్యాండ్రీ, దోబీఘాట్లు, కమ్యూనిటీ హాల్, ఇళ్లకు స్థలాలు కేటాయించాలని కోరారు. స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ వై రామాంజనేయులు, రజక సంఘం నాయకులు శివప్ప, శ్రీనివాసులు, లక్ష్మమ్మ, శివశంకర్, రాధమ్మ, గంగన్న, ఎన్. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసంవారిపల్లి పాఠశాలలో తాగునీటి ఎద్దడి

నంబులపూలకుంట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆసంవారిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాల ఆవరణంలో గతంలో బోరు వేశారు. సమృద్ధిగా నీరుంది. అయితే బోరుకు అమర్చిన విద్యుత్ మోటారు కాలిపోవడంతో పాఠశాలలో తాగునీటి ఎద్దడం నెలకొందని గ్రామస్థులు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం చేసిన తరువాత విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

బత్తలపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం గుర్తు తెలియని వృద్ధురాలు(65) మృతి చెందినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బత్తలపల్లిలోని శివాలయం ఎదురుగా ఉన్న నాగులకట్టపై 20 రోజులుగా మతిస్థిమితంలేని ఓ వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. సమీపంలోని వారు ఆమెకు భోజనం పెట్టేవారు. ఆదివారం భోజనం పెట్టేందుకు వెళ్లగా అప్పటి కే ఆమె మృతి చెందినట్లు గుర్తించామని స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రయాణం.. నరకప్రాయం


దెబ్బతిన్న ఉగ్గిరెడ్డిపల్లి తారు రోడ్డు


గుంతలమయమైన నల్లగుట్లపల్లి రహదారి

● గుంతల రోడ్లలో ప్రయాణికుల ఇక్కట్లు
● వైసీపీ నిర్లక్ష్యమే కారణం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్లలో ప్రయాణించాలంటే ఒళ్లు గుల్ల అవుతోంది. అసలే వర్షాకాలం, ఏ గుంత ఎంత లోతు ఉంటుందో తెలియని పరిస్థితి. రోడ్లు వర్షపు నీటితో నిండిపోవడంతో ఎక్కడ ఎంతలోతు గుంతలున్నాయో తెలియక ద్విచక్రవాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. అదుపు తప్పి గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. దెబ్బతిన్న రోడ్లను గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బాగుచేయలేదు. దీంతో ఉన్న అతు కులు గతుకుల రోడ్లులోనే ఆయా గ్రామాల ప్రజలు అతి కష్టం మీద ప్రయాణం సాగించారు. ప్రస్తుతం ఆ రోడ్లు మరింత దెబ్బతినడంతో ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. మండలపరిధిలో అల్లాపల్లి పంచాయతీలోని ఉగ్గిరెడ్డిపల్లి రోడ్డు, వెంకటాపురం పంచాయతీలోని నారప్పగారిపల్లి క్రాస్ నుంచి కరకమాను తోపు వరకు రోడ్డులో ఈ పరిస్థితి నెలకొంది.

వైసీపీ పాలనలో నోచుకోని అభివృద్ధి

గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. ఇందుకు నిదర్శనం ఉగ్గిరెడ్డిపల్లి, వెంకటాపురం రోడ్లు. ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిదులు దృష్టికి గతంలో తీసుకెళ్లినా ఫలితం శూన్యం. దీంతో గత్యంతరం లేక ఉన్న రోడ్డునే వినియోగించుకుంటూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో పాద చారులు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రధానంగా రోడ్లు గుంతలమయం కావడంతో ద్విచక్రవాహనదారులకు, ఆటోల్లో ప్రయాణించేవారికి వెన్ను నొప్పులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ద్విచక్రవాహన దారులు ఆదమరచి గుంతల్లో పడి రక్త గాయాలపాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. గత వైసీపీ పాలనలో దెబ్బతిన్న, గుంతలమయం అయిన రోడ్లుతో ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే దృష్టిసారించి, రోడ్లు వేయాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో తప్పని తిప్పలు

అత్యవసర పరిస్థితుల్లో ఉగ్గిరెడ్డిపల్లి, వెంకటాపురం పంచాయతీల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. అత్యవసర సమయంలో 108 వాహనం అతి కష్టం మీద గ్రామంలోకి వచ్చినా, సమయం ఎక్కువ పడుతోంది. ఆ లోపు జరగరానిది జరిగే అవకాశాలున్నాయి. ఉగ్గిరెడ్డిపల్లిలో దాదాపు రెండు కిలోమీటర్లు, నారప్పగారిపల్లి క్రాస్ నుంచి కరికమాను తోపు వరకు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. దీంతో అరగంట పట్టే ప్రయాణం రెట్టింపు సమయం పడుతోంది.

ఒళ్లు హూనమవుతోంది



ఎగుడుదిగుడు రోడ్డుపైన వాహనాల్లో ప్రయాణించడంతో ఒళ్లు నొప్పులు వస్తున్నాయి. యుక్త వయస్సులోనే వెన్ను నొప్పి వస్తోంది. రోడ్లు బాగుచేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

-ఎం.చంద్ర, నారప్పగారిపల్లి

అధికారులకు చెప్పి విసిగిపోయాం



రోడ్డు బాగుచేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు అధికారులకు చెప్పి విసిగిపోయాం. దీంతో గత్యంతరం లేక ఎగుడుదిగుడు రోడ్లపైనే ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. దెబ్బతిన్న రోడ్లలో మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకోక ముందే అధికారులు స్పందించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలి.

-కృష్ణమూర్తి, ఉగ్గిరెడ్డిపల్లి

ఆటోల్లో అధిక చార్జీలు



రోడ్లు దెబ్బతినడంతో ఆర్టీసీ బస్సులుకూడా గ్రామాలకు రావడంలేదు. దీన్ని ఆసరా చేసుకుని ఆటోల వారు ప్రయాణికులు, విద్యార్థుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-శ్రీనివాసులు, ఎంపీటీసీ, వెంకటాపురం

జిల్లా కేంద్రం మార్పు తగదు

● ఏఐసీసీ సభ్యుడు కోటా సత్యనారాయణ


మాట్లాడుతున్న కోటా సత్యం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోట్లాది ప్రజల ఆకాంక్షతో ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రాన్ని రాజకీయ స్వప్రయోజనాల కోసం పుట్టపర్తి నుంచి మార్పుచేయడం తగదని ఏఐసీసీ కమిటీ సభ్యులు కోటా సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... శ్రీసత్యసాయి జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి హిందూపురానికి మారుస్తారని కొంతకాలంగా జరుగుతున్న ప్రచారంపై అన్ని పార్టీల నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను ఏర్పాటుచేయాలన్న సత్యసాయి సోదరులు, ఈప్రాంత వాసుల కల మూడేళ్ల కిందట సాకారమైందన్నారు. అన్ని నియోజకవర్గాలకు మధ్యలో ఉండి అన్ని మౌలిక సదుపాయాలు, అన్ని ప్రాంతాలకు రైలు, రోడ్డు, వి మాన మార్గాలు, భూవనరులు కలిగిఉన్న పుట్టపర్తిని కాదని... మూలన, కర్ణాటక రాష్ట్రం సరిహద్దున ఉన్న హిందూపురానికి జిల్లా కేంద్రాన్ని తరలించడం ఏవిధంగా సమంజసమో ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో అనుభవజ్ఞుడని జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి తరలించరనే ఆపారనమ్మకం తమకుందన్నారు. ఇదే విషయాన్ని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, మేధావులు మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

నేడు జాబ్‌మేళా

ధర్మవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. వారు ఆదివారం కళాశాలలో ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్‌తో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులకు రూ. 1.8 లక్ష నుంచి రూ. 3.8 లక్షల మధ్య వార్షిక ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9912679876, 9052984089 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. కళాశాల ఇన్‌చార్జ్ రమేశ్, ప్లేస్మెంట్ సెల్ అధికారి శ్రీనివాస్, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

● ఎమ్మెల్యే కందికుంట ● పీబీసీకి నీటి విడుదల


కాలువకు నీటిని విడుదల చేసి జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కదిరి అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్‌తో కలిసి నీటిని విడుదల చేశారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంతో సాగునీటికి ఇబ్బందులు పడ్డారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలు కాపాడుతూనే పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటిని తరలిస్తున్నామన్నారు. సాగునీటి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని, మండలంలోని పట్నం, కాళ సముద్రం చెరువులకు నీరందించామన్నారు. రాయలసీమ వాసి అయిన జగన్ తన పాలనలో హంద్రీనీవా సుజల స్రవంతి కాలువకు ఎన్ని కోట్ల రూపాయలు కేటాయించారో ప్రజలకు తెలపాలని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం రూ. 200కోట్లతో కాలువ లైనింగ్ పనులు చేపట్టి సాగునీరు వృథాకాకుండా చూస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరి పట్టణానికి తాగునీరు అందించాలని జీఓ తేస్తే, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి అమలు చేయలేకపోయిందనారు. తాజాగా రూ.23 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాన్నారు. శాశ్వత పనులకు ప్రాధాన్య క్రమంలో నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, కూటమి నాయకులు ఫర్వీన్‌బాను, అనసూయ, చెన్నకేశవులు, బాహా ద్దీన్, గంగులప్ప, హరి, రామచంద్ర, చిన్నానాయుడు, రామమోహన్, రమేష్, కుప్పాల ప్రసాద్, మనోహర్, జయచంద్ర, ప్రేమలత, యూనూస్, సుధాకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.


బడన్నపల్లి రహదారిలో మడుగులా నిలిచిన నీరు


చౌటకుంటపల్లి ప్రధాన రహదారిలో నిలువ ఉన్న నీరు

రోడ్లపై మడుగులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లికి వెళ్లాలంటే ఇప్పటికీ మట్టి రోడ్డే గతి. పైగా ఆ రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గుంతల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరానికి వెళ్లే రహదారి క్రాస్ నుంచి రైల్వే బ్రిడ్జి కింద వరకు కిలోమీటర్ మేర మట్టిరోడ్డు గుంతలమయం అయింది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీరంతా ఆ గుంతల్లో నిలిచి మడుగును తలపిస్తోంది. అలాగే రోడ్డంతా బురదమం అయింది. దీంతో వాహన దారులు ఆ రహదారిలో వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. ఎక్కడ జారి ఎడతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వస్తే ఆ రహదారిలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆ గ్రామస్థులు తెలుపుతున్నారు. అధికా రులు స్పందించి రహదారిని బాగుచేయాలని వారు కోరుతున్నారు.

● నల్లమాడ: మండలంలోని చౌటకుంటపల్లిలో మలకవేముల - ఓడీసీ ప్రధాన రహదారిలో ఇళ్లకు ఇరువైపుల మురుగునీరు నిలువ ఉంది. అబ్బా ఈ మురుగుతో ఎన్ని అగచాట్లో అని ప్రజలు వాపోతున్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షం నీరు ముందుకు వెళ్లడానికి వీలులేక రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే వాహన దారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో సమీపంలోని ఇళ్లలోకి మురుగునీరు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వారం రోజులుగా నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధిచెంది విషజ్వరాలు ప్రబలే అవకాశమున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వాగు పారితే విద్యుత్ సరఫరా అంతే..!


చిన్నపాటి వర్షానికే సబ్‌స్టేషన్ వద్ద పారుతున్న వాగు

గాండ్లపెంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సమీపంలోని వాగు ప్రవహిస్తే మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి నీరువస్తాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో కదిరి-రాయచోటి రోడ్డు వద్ద వాగు పక్కన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. గతంలో భారీ వర్షాల కారణంగా సబ్‌స్టేషన్‌లోకి నీరు చేరడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అయితే ఇప్పటివరకు సబ్‌స్టేషన్‌లోకి వాగు నీరు ప్రవహించకుండా ఎలాంటి ప్రహరీ నిర్మించలేదు. కనీసం వాగును దారి మళ్లించే ప్రయత్నాలు జరగలేదు. సబ్‌స్టేషన్‌లో నిరంతరం విద్యుత్ హైవోల్టేజీ ఉంటుంది. దీంతో వాగు ప్రవహిస్తే విద్యుత్ అంతరాయం తప్పదని ప్రజలు అంటున్నారు. దీనిపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాగు నీరు సబ్‌స్టేషన్‌లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కృష్ణుడి ఊరేగింపు


శ్రీకృష్ణుడి ప్రతిమకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని మద్దన్నగారిపల్లిలో ఆదివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పూలమాలలు, కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చినగాని నరసింహ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, గంగాధర్ యాదవ్, చినగాని కృష్ణయ్య, నరేంద్ర, గంగాధర్, మురళి, పుల్లయ్య, బాలరాజు, విజయ్‌కుమార్‌తో పాటు మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్


టీషర్టులను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని కల్గిస్తాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో మంత్రి ఆదివారం పలు సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ముందుగా త్వరలో ప్రారంభం కానున్న అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ టోర్నీ సీజన్-2 టీషర్టులను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమన్నారు. యువత చురుకుగా క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపు నిచ్చారు. పట్టణంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని భరోసా ఇచ్చారు. అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ టోర్నీని గత ఏడాది విజయవంతంగా నిర్వహించినట్టు మంత్రి గుర్తుచేశారు. అదే విధంగా రెండో సీజన్‌ను మరింత విస్తృతస్థాయిలో ఎక్కువమంది యువత పాల్గొనేలా, క్రీడాస్ఫూర్తిని పెంపొదించేలా నిర్వహించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ: మంత్రి సత్యకుమార్ ఆదివారం నియోజకవర్గంలోని 31మందికి రూ.15,13,747 విలువైన చెక్కులను పంపిణీచేశారు. ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా వైద్య సహాయం అందుతుందన్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలబడి సహాయం అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, క్రికెట్ కోచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు: మంత్రి

ధర్మవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 25 మందిని ధర్మవరం నుంచి బెంగళూర్‌లోని వైదేహి ఆస్పత్రికి పంపేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సును ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.... రోగులకు శస్త్రచికిత్సల ఖర్చులు సహా అన్ని వైద్య సదుపాయాలను సంస్కృతి సేవా సమితి భరిస్తుందని వెల్లడించారు. అవసరమైన వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైదేహి ఆస్పత్రి వైద్యులు సంజయ్,పవన్, లోకేశ్, భరణి, సుంకేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, నాయకులు పోతుకుంట రాజు, ఊట్ల నరేంద్ర, భక్తవత్సలం, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించడంతో పుట్టపర్తి లో ఆదివారం మహిళలు సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు ఉచిత బస్సు కల్పించినందుకు మహిళలు పెద్దఎత్తున హాజరై హర్షం వ్యక్తం చేశారు. మహిళలతో కలసి తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కేక్ కట్ చేసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రతికుటుంబానికి ఏదో విధంగా లబ్ధిచేకూరేలా కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం అర్చకులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షిస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత బజరంగీ బాయ్స్ జట్టు



ట్రోఫీ అందుకుంటున్న జట్టు సభ్యులు

అగళి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న ప్రీమియర్‌లీగ్ సీజన్ వన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ విజేతగా ఆలూడి భజరంగీ బాయ్స్ జట్టు నిలిచింది. ఫైనల్స్‌లో క్రికెట్‌క్లబ్ జట్టును ఓడించింది. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 30 వేలు, రన్నర్స్‌కు రూ. 15వేలు, తృతీయస్థానంలో నిలిచిన రామాపురం వారియర్స్ జట్టుకు రూ. 10 వేలను అందించారు. కార్యక్రమంలో కోటిపల్లి కామరాజ్, టోర్నీ ఆర్గనైజర్లు గోవిందరాజు, మూర్తి, రవి, హరీష్ పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరండి

హిందూపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట వడ్డెనాగరాజు ఓ ప్రకటనలో కోరారు. పార్టీ ఆదేశాల మేరకు బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ కలెక్టరేట్‌వద్ద నిరసన చేపడుతున్నామన్నారు. బహుజనులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇంట్లో చోరీ



చిందరవందరగా పడేసిన బీరువాలోని దుస్తులు

హిందూపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని టీచర్స్‌కాలనీ శివారు ప్రాంతంలో చోరీ జరిగింది. బాధితుడు మహబూబ్‌బాషా తెలిపిన వివరాల మేరకు కుటుంబ సభ్యులు శనివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసుకుని ముక్కడిపేటలో ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా గేటుకు తాళం పగిలిపోవడం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. దీనిపై టూటౌన్ సీఐ కరీంను వివరణ కోరగా చోరీ జరిగినట్లు విషయం తెలిసిందని, ఆ విషయమై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

అన్నదానం

పెనుకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం వద్ద బాబా చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం వారపు సంతకు వచ్చిన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ శంకర్, సూర్యనారాయణ, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి



పూజలు నిర్వహిస్తున్న తిప్పేస్వామి

మడకశిర రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమల గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నాగులకట్టకు ప్రత్యేక పూజలు



అభిషేకం చేస్తున్న అర్చకులు

పెనుకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక భోగసముద్రం చెరువు ఒడ్డున కొత్తగా ప్రతిష్ఠించిన నాగులకు శ్రావణమాసం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు, పాలాభిషేకం అర్చకులు హేమంత్ నిర్వహించారు. పూజలకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

వెంకటేశ్వర స్వామికి..



రొళ్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాళెం శ్రీవెంకటేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాస చివరి ఆదివారం కావడంతో భక్తులు మొక్కుబడి తీర్చుకున్నారు. రొద్దం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాస పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

రొద్దం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పెద్దకోడిపల్లికి చెందిన ఇసుక ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని తురకలాపట్నం వద్ద ఢీకొంది. శనివారం అర్ధరాత్రి పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన బేల్దార్ అంజి ట్రాక్టర్ ఇసుకను సరఫరా చేసి తిరుగు ప్రయాణంలో తురకలాపట్నం సమీపంలోని సబ్‌స్టేషన్‌కు ఎదురుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. రెండు విద్యుత్ స్తంభాలు విరిగి ట్రాక్టర్‌పై పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహాసభ

సోమందేపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో భారతి గ్రామైక్య సంఘం వార్షిక మహాసభలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షులు నిర్మల సురేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణంలో 34మహిళా సంఘాల సభ్యులు కలిసి మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామైక్య సంఘాల పురోగతి వాటి నిర్వహణ భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు. మహిళలు సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి ముందుకు సాగాలని కోరారు. అనంతరం మహిళా సంఘాలలో ప్రతిభ చూపిన వారికి అవార్డును అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, పాఠశాల చైర్మన్లు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కేబుల్ చోరీలు

బెంబేలెత్తుతున్న రైతులు



చాగలేరు వద్ద వ్యవసాయ బోరుబావుల కేబుల్ కత్తిరించి ఎత్తుకెళ్లిన దృశ్యం (ఫైల్)

చిలమత్తూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒక పక్క సకాలంలో వర్షాలు పడక సాగుచేసుకుంటున్న పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థంకాని పరిస్థితుల్లో ఉంటున్నారు. మరోవైపు బోరుబావులకు ఏర్పాటుచేసుకున్న కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అందిన కాడికి కోసుకెళుతున్నారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. మండలంలో ఇటీవల బోరుబావుల కేబుల్ చోరీలు అధికమయ్యాయి. చీకటి పడగానే దొంగలు పొలాల్లోకి వెళ్లి మోటార్లకు ఏర్పాటుచేసుకున్న కేబుల్‌ను కోసుకుపోతున్నారు. నెలలో నాలుగు నుంచి ఐదు సంఘటనలు చోటుచేసుకుంటున్నా వాటి నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నట్లు లేదని రైతులు అంటున్నారు. గత నెల 20వ తేదీన కోడూరు గ్రామ సమీపంలో ఒకే రోజు 11 బోరుబావులకు సంబంధించిన కేబుల్‌ను కత్తిరించుకుపోయారు. అందులో 4 పంచాయతీ తాగునీటి బోర్లు ఉండగా, మిగిలినవి రైతులకు సంబంధించినవి. అది మరచిపోకనే ఈనెల 15 రాత్రి చాగలేరు గ్రామ పరిసరాల్లో 8 బోరుబావులకు చెందిన వైర్లు కోసుకుపోయారు. ఈ చోరీలతో రైతులు లబోదిబోమంటున్నారు. కేబుల్ మీటరు రూ.250 వరకు ధర పలుకుతోంది. దీంతో కొత్త కేబుల్ తెచ్చుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఒక్కో బోరుబావికి సంబంధించి 5 మీటర్ల నుంచి 30, 40 మీటర్ల వరకు వైరుని కోసుకెళుతున్నారు.

చోరీతో అదనపు వ్యయం

కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకెళుతుండటంతో రైతులకు ఆర్థిక నష్టం జరగడంతో పాటు పనిభారం పెరుగుతోంది. దొంగలు వైరు కోసుకెళ్లేటప్పుడు వైరుని బోరుబావి అడుగుభాగం వరకు కత్తిరిస్తుండటంతో సమస్య ఉత్పన్నమవుతోంది. కేబుల్ జాయింట్ వేయడానికి వీలు లేకుండా కత్తరించడంతో మోటారుని బయటికి లాగాల్సి వస్తోంది. అందుకు గాను రైతులు క్రేన్ మిషన్ సాయం తీసుకోవాల్సి వస్తోంది. క్రేన్ కోసం రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. దీంతో కేబుల్‌తోపాటు అదనంగా క్రేన్ మిషన్ భారం తమపై పడుతోందని వారు ఆవేదన చెందుతున్నారు.

కాపర్ వైరుకు మంచి ధర

కాపర్ వైరుకి మార్కెట్లో మంచి ధర ఉండటంతో కొందరు కేబుల్ చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కొత్త కాపర్ వైరు కిలో రూ. 1200 నుంచి రూ. 1400 వరకు పలుకుతోంది. అయితే దొంగలు కోసికెళ్లే కేబుల్ నుంచి కాపర్ వైరుని వేరు చేస్తారు. అనంతరం లభించిన కాపర్ వైరుని అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు. ఇలా కేబుల్ నుంచి వేరు చేసిన కాపర్ వైరు బయట కిలో రూ. 500 నుంచి రూ. 600ల వరకు పలుకుతోంది. దీంతో కొందరు ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నట్లు రైతులు అంటున్నారు. అయితే కేబుల్ దొంగలను పట్టుకోవడంలో పోలీసులు తీవ్రంగా విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటిదాకా మండలవ్యాప్తంగా ఎన్నో సంఘటనలు జరిగినా ఒక్క కేబుల్ చోరీ కేసులో ఒక్కరిని కూడా పట్టుకోలేదని రైతులు అంటున్నారు.

పోలీసులు నిఘా పెట్టాలి



తాగునీటి బోర్ల కేబుల్ వైర్లను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తరుచూ కోసికెళుతున్నారు. దీంతో పంచాయతీకి నష్టం వస్తోంది. నెలలో రెండు మూడు బోర్లకు ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. దొంగలు ఎత్తుకెళ్లినప్పుడల్లా కొత్త కేబుల్ కొనాల్సి వస్తోంది. కేబుల్ వైరు ధర కూడా ఎక్కువగా ఉండటంతో అనవసరంగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతుల బోర్లకు ఉన్న కేబుల్ వైర్లు కూడా ఎత్తుకెళుతున్నారు. కొంత కాలంగా వైర్ల చోరీ సమస్య తీవ్రంగా ఉంది. పోలీసులు నిఘా పెట్టి నియంత్రించాల్సి ఉంది.

-మురళీమోహన్, కోడూరు సర్పంచ్

నెలలో రెండోసారి చోరీ



ఆగస్టులోనే రెండు దఫాలుగా కేబుల్ వైరు, స్టాటర్‌ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఏ మాత్రం భయం లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. ఒకేరోజు 11 బోర్లకి సంబంధించి వైర్లు ఎత్తుకెళ్లారు. దొంగలు వైరు ఎత్తుకెళ్లడంతో కొత్తది కొనాల్సి వచ్చింది. అందుకు రూ. 5 వేల వరకు ఖర్చయ్యింది. ఇటీవల కేబుల్ వైర్లు కోసికెళుతూ దొంగలు మాకు నిద్రలేకుండా చేస్తున్నారు. కాపలా వెళ్లినా ఏదో ఒక సమయంలో చోరీకి పాల్పడుతున్నారు. పోలీసులు ఇలాంటి దొంగతనాలపై నిఘా పెట్టాలి.


-రామిరెడ్డి, రైతు, కోట్లోపల్లి

నేడు నిడిగల్ ఉత్సవం



నిడిగల్ దుర్గంపై వెలసిన బసవన్న ఆలయం





యుద్ధంలో ఉపయోగించిన ఫిరంగి, నిడిగల్ దుర్గానికి వెళ్లే కోటదారి

పావగడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రెండో హంపీగా పేరుగాంచిన నిడగల్ ఉత్సవాలు సోమవారం జరగనున్నాయి. పావగడ పట్టణానికి 22 కి.మీల దూరంలో నిడిగల్ దుర్గం ఉంది. పూర్వం అనేక మంది రాజులు ఈ దుర్గాన్ని పరిపాలించినట్లు చరిత్ర చెబుతోంది. చోళ, పల్లవ తదితర రాజవంశాలు ఈ దుర్గాన్ని పరిపాలించాయి. ఆ సందర్భంగా ఎన్నో ఆలయాలను వారు నిర్మించారు. ఆలయాల్లో శిల్పాలు అబ్బురపరిచేలా ఉన్నాయి. 101 దేవాలయాలు నిర్మించగా రామతీర్థంను భక్తులు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. రామతీర్థంలో స్నానమాచరిస్తే కంకణభాగ్యం, సంతానయోగం కలుగుతుందన్నది భక్తుల విశ్వాసం.

నిడిగల్ ఉత్సవానికి పావగడ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న నిడిగల్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మెడికల్ సంస్థాన వాల్మీకి పీఠాధిపతి సంజయ్‌కుమార్‌స్వామీజీ ప్రభుత్వాన్ని కోరారు. నిడిగల్‌దుర్గంలో ఎన్నో ఆలయాలు, చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

పంటలపై వన్యప్రాణుల దాడులు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

అటవీ, కొండ ప్రాంతాల్లో తగ్గుతున్న సాగు

ఆదుకోవాలంటూ అధికారులకు వేడుకోలు



పొలాల్లో సంచరిస్తున్న జింకలు

మడకశిర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల దాడులు కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోతుండడంతో అటవీ ప్రాంతాల సమీపంలో ఉన్న భూములలో పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రతి యేడు ఆ ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఏ పంట సాగు చేసినా ఏదోవిధంగా పంట దెబ్బతిని నష్ట పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదని, దీంతో ప్రతి పంట సాగుకు అప్పు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సాగుచేసిన పంటలను రక్షించుకోవడానికి రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసినా ప్రారంభంలో అడవి పందులు, ఎలుగు బంట్లు బెడద అధికంగా ఉంటోందని రైతులు అంటున్నారు. ఏదోలా వాటి నుంచి పంటలను రక్షించుకుంటే కొన్నాళ్లకు జింకలు, నెమళ్ల బెడద ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంట దెబ్బతిని నష్టపోవాల్సి వస్తోందని అంటున్నారు. పది సంవత్సరాలు క్రితం 48 వేల హెక్టార్లలో పంటలు సాగు చేసేవారు. అటవీ, కొండ ప్రాంతాల్లో నెమళ్లు, పందులు దాడి వల్ల పంటలు దెబ్బతిని నష్టపోతుండడంతో రైతులు పంటలు సాగు చేయడమే తగ్గించేశారు. అటవీ ప్రాంతాల్లో 20 శాతం మేరకు సాగు తగ్గిపోయింది. ప్రస్తుతం నార్మల్ ఏరియా 34వేల హెక్టార్లకు పడిపోయింది. నియోజకవర్గంలోని రొళ్ల, మడకశిర, గుడిబండ, అమరాపురం, అగళి మండలాల్లో అటవీ ప్రాంతాలు కొండలు గుట్టలు అధికంగా ఉన్నాయి. జింకలు, అడవిపందులు, ఎలుగుబంట్లు బెడద అధికంగా ఉంటుంది. ఆ పరిసర ప్రాంతాల్లో ప్రతి యేడు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు రైతులు చెబుతున్నారు. సాగుచేసిన పంటలపై జింకలు, అడవి పందులు పడి నాశనంచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంటలు సాగు చేసినప్పుడు రైతులు పంట పొలాల వద్ద కాపలాకు వెళ్లేవారు. పంటలను కాపాడుకునేవారు. అయితే ఇటీవల కాలంలో ఎలుగుబంట్ల సంచారం అధికం కావడంతో రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు. జింకలు, అడవి పందులు పంటలపై పడి నాశనం చేస్తున్నాయంటున్నారు రైతులు. పంటలను వాటి నుంచి కాపాడుకోవడానికి పొలాల చుట్టు చీరలతో కంచె మాదిరిగా కడుతున్నామని, అయినా వాటి దాడులను ఆపలేకపోతున్నామని అంటున్నారు.

30 శాతం పొలాలు బీడే

అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిని నష్టం వాటిల్లడం, మరోవైపు జింకలు, అడవిపందులు, నెమళ్ల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో అటవీ ప్రాంతాల సమీపంలోని పొలాల్లో చాలా మంది రైతులు పంటలు సాగు చేయక పొలాలను బీడుగా వదిలేశారు. దీంతో ఆ భూములు కూడా బండ బారి పోతున్నాయి. జింకలు, అడవిపందులు, నెమళ్ల దాడి నుంచి పంటలను రక్షించుకునేందుకు ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు అటవీశాఖ అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందని రైతులు అంటున్నారు.

పంటలకు నెమళ్లు, జింకల బెడద



అష్టకష్టాలు పడి సాగు చేసిన పంటలకు నెమళ్లు, జింకలు దాడులు చేయడంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టం వాటిల్లుతోంది. దీనికి తోడు ఎలుగుబంట్ల బెడద అధికంగా ఉంది. నాకు 3 ఎకరాల పొలం ఉంది. అందులో ఎకరాలో మాత్రమే పంట సాగు చేస్తున్నా. మిగతా పొలాన్ని బీడుగా వదిలేస్తున్నా. వన్యప్రాణులు పంటలపై దాడి చేయకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రంగనాథప్ప, రైతు, మల్లినమడుగు

'స్త్రీ శక్తి' ప్రారంభం



ఉచిత ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అమరాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వలస గ్రామంలో స్థానిక టీడీపీ నాయకులు స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప ఆధ్వర్యంలో వి అగ్రహారం, అమరాపురం, మడకశిర వరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి స్వీట్లు పంచారు.

నిరుపేదలకు వరం.. సీఎం రిలీఫ్ ఫండ్

-మంత్రి సవిత



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ఆర్థిక స్థోమతలేక అనారోగ్యం బారిన పడుతున్న పేదలకు ఎంతో దోహదపడుతుందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సవిత చేతులమీదుగా 34 మంది లబ్ధిదారులకు రూ.19,52,195 చెక్కులు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా చేసుకుని సీఎం రిలీఫ్‌ఫండ్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 3కోట్లకుపైగా నిధులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మీసేవ సమీ, నారాయణస్వామి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గం

పెనుకొండ టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పెనుకొండ మండలం యూనియన్ అధ్యక్షునిగా హరినాథ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిక చేపట్టారు. ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ ఇంజనీర్ జగదీశ్ ఆధ్వర్యంలో లెక్కల శ్రీనివాసులు, గన్నం శ్రీనివాసులు, హరిబాబు, విజయభాస్కర్‌రెడ్డి, విజయశేఖర్‌నాయుడు, అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా హరినాథ్, వైస్ ప్రెసిడెంట్‌గా నర్సింగరావు, జనరల్ సెక్రటరీగా జయవర్ధన్‌గౌడ్, జాయింట్ కార్యదర్శి మల్లికార్జున, చిరంజీవి, కోశాధికారి గణేష్, జిల్లా కౌన్సిలర్‌గా షెక్షావలి, సుంకప్ప, గౌరవాధ్యక్షురాలిగా కల్యాణి ఎంపికయ్యారు.

గురుకులంలో జ్వరం కేసులు తగ్గుముఖం

హిందూపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలుగూరు వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో విషజ్వరాలు తగ్గుముఖం పట్టాయని వైద్యులు జయంత్‌నాయక్ తెలిపారు. ఆదివారం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇటీవల వైరల్ జ్వరాల కేసులు ఉన్నాయని అయితే గురుకుల పాఠశాలలో తీసుకున్న చర్యలతో గణనీయంగా తగ్గాయన్నారు. అయితే పాఠశాల ఆవరణంలో నీటి పైపులైన్ లీకేజీ ఉండటం గమనించి వాటిని మరమ్మతులు చేయించారు.

నిమ్మలను కలిసిన సగర కార్పొరేషన్ చైర్మన్



నిమ్మలను సన్మానిస్తున్న వెంకటరమణ

గోరంట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వెంకటరమణ మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల కిష్టప్పను ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా నిమ్మల కిష్టప్పను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలకన్వీనర్ సుబ్రహ్మణ్యం, పట్టణ కన్వీనర్ కక్కల రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి: ఆటో కార్మికులు

గోరంట్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో కార్మికులను ప్రభుత్వ ఆదుకోవాలని నిర్వాహకులు ఆదివారం నిరసన తెలిపారు. స్త్రీశక్తి పథకం వల్ల తాము జీవనోపాధి కోల్పోతున్నట్లు ఆవేదన చెందారు. గోరంట్లలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో నిర్వాహకులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడాన్ని వ్యతిరేకించడంలేదన్నారు. నష్టపోతున్న తమను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. రుణ, ఇంధన సబ్సిడీతోపాటు రూ. 5లక్షల వాహన బీమా, వడ్డీలేని రుణం, లైసెన్సు ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు యేడా రూ.25వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం కొండా వెంకటేష్, నాగరాజు, నూర్‌బాషా, మహబూబ్‌బాషా, మహమ్మద్, ఆటో కార్మికులు శంకర్, భక్తర్, సోముశేఖర్, బాబా పాల్గొన్నారు.

గుడిబండలో వర్షం



గుడిబండలో కురుస్తున్న వర్షం

గుడిబండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి దాకా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రైతులు సాగుచేసిన పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.